ప్రభాత సమాచారం
https: epaper.prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శనివారం । 20 డిసెంబర్ 2025 । ■ 10 పేజీలు



## మంత్రి జూపల్లిని కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు




7లో

# పీఏసీఎస్ పాలకవర్గాలు రద్దు

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

■ 9జిల్లాల డీసీసీబీలు కూడా ■ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ■ ఆగస్టు 14వ తేదీనే ముగిసిన పదవీకాలం
■ పాలన స్తంభించకుండా సర్కార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ■ పర్సన్ ఇంచార్జీలకు పీఏసీఎస్‌ల బాధ్యతలు
■ ఆయా జిల్లాల కలెక్టర్లు, డీసీసీబీలకు బాధ్యతలు ■ కొత్త జిల్లాలు, మండలాల ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణ
■ ఆ తర్వాతే సహకార సంఘాలకు ఎన్నికలు ■ వ్యవసాయ అనుబంధ పథకాలను క్షేత్ర స్థాయిలో చేసేందుకు చర్యలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), డీసీసీబీ టెస్కాబ్ చైర్మన్లు, డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు వ్యవసాయశాఖ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 14వ తేదీనే వీరి పదవీకాలం ముగిసినట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఇకపై వీరికి అధికారిక హోదా ఉండదని తెలిపింది. ఆయా జిల్లాల కలెక్టర్లు డీసీసీబీల బాధ్యతలు వహించనున్నారు. పీఏసీఎస్‌లకు పర్సన్ ఇంచార్జీలను నియమించనున్నారు. కొత్త మండలాలు, జిల్లాల ప్రకారం ప్రభుత్వం వీటిని పునర్వ్యవస్థీకరించనుంది. ఈ చర్యతో సహకార రంగంలో కొత్త పాలనా ఏర్పాట్లకు మార్గం సుగమమవుతుందని అధికారులు పేర్కొన్నారు.



10

## రాష్ట్రంలో పాలన గాడి తప్పింది

■ అబద్ధాలు మాట్లాడే సీఎంను ఎక్కడా చూడ లేదు
■ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో ఉమ్మడి జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలు

దేశంలో మోడీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరగడం వలన దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు అధికారులు ఉన్నాయని రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా డబ్బులు ఇంజన్ సర్కార్ రాబోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డితో కలిసి నిర్మల్ జిల్లాలో బిజెపి మద్దతు గెలిచిన సర్పంచులు ఉపసర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వారిని సన్మానించారు. ఈ సందర్భంగా బీజేఎల్పి నేత మహేశ్వర్‌రెడ్డి  మాట్లా డుతూ.. రాష్ట్రంలో అధికారులు ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అబద్ధాలు మాట్లాడే ముఖ్యమంత్రి ఎక్కడ చూడ లేదని మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## అభివృద్ధే ధ్యేయం

■ చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
■ మంత్రి వివేక్‌వెంకటస్వామి
■ అంబేద్కర్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవం
■ అమృత్ పథకం ద్వారా ప్రతీ గ్రామానికి తాగునీరు అందించేందుకు చర్యలు
■ చెన్నూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం



10





## 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

■ 24 ఆయుధాలు, 733 తూటాలు స్వాధీనం ■ ముగ్గురు ఉమ్మడి ఆదిలాబాద్ మావోలు..
■ లొంగిపోయిన వారిలో మంచిర్యాల జిల్లా పొన్కల్‌కు చెందిన కనికారపు ప్రభంజన్
■ కుమ్రంభీం జిల్లాకు చెందిన ఇద్దరు సెంట్రల్ కమాండర్లు ■ వివరాలువెల్లడించిన డీజీపీ శివధర్

నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పీఎల్‌జీఏ బెటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు లొంగిపోయినట్లు చెప్పారు. అందులో మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొన్కల్‌కు చెందిన కనికారపు ప్రభంజన్ కాగా మిగతా వాళ్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారని తెలిపారు. అలాగే ఇద్దరు కుమ్రంభీం డివిజన్ కమిటీ కార్యదర్శి, ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు లొంగిపోయినట్లు పేర్కొన్నారు.



## చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి
# ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర కార్మిక మంత్రి వివేక్‌వెంకటస్వామి
- అంబేద్కర్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవం
- అమృత్ పథకం ద్వారా నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి తాగునీరు అందించేందుకు చర్యలు
- చెన్నూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం



**చెన్నూర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి హాజరై కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా చెన్నూర్ మండల కేంద్రంలో 20 లక్షల రూపాయల డిఎంఎఫ్‌టి నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, భవనం మరింత విస్తరించేందుకు అదనంగా మరో 20 లక్షల రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కమ్యూనిటీ భవనాన్ని దళిత సంఘాలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశిత నిబంధనలతో భవన నిర్వహణ కొరకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇదే తరహాలో భీమారం మండలంలో 25 లక్షల రూపాయలతో నేతకాని భవనం, జైపూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో జగ్జీవన్ రామ్ భవనం, చెన్నూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో ముదిరాజ్ భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా భవనాలకు అదనపు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణం కొరకు భూమి కలిగి ఉన్నట్లయితే ప్రభుత్వం తరపున భవన నిర్మాణానికి చేయూత ఇస్తామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 15 కోట్ల రూపాయలతో సి.సి.రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వచ్చే విడతలో 70/80 కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు తాగునీటి కొరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమృత్ పథకం ద్వారా నీటి ట్యాంకులు, పైప్ లైన్లు ఏర్పాటు చేసి నిరంతరం త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని, మే నెల వరకు ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఆసుపత్రిలో తగినంత సిబ్బంది నియామకానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం 9కోట్ల 55 లక్షల రూపాయల టియుఎఫ్ఐడిసి నిధులతో చేపట్టిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. ప్రజలందరికీ ఒకే చోట కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకు సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, మాంసకు ఉత్పత్తులకు సంబంధించి మార్కెట్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చెన్నూరు మండల కేంద్రంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాత శిశు ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి కిడ్నీ బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకం కింద చెన్నూర్ మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 40 కోట్ల రూపాయలు, మందమర్రి మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలతో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ భవనాన్ని ప్రజలు బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చని, ఈ భవనంలో గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమీకృత కూరగాయల మార్కెట్ ఏర్పాటు ద్వారా వీధి వ్యాపారులకు ఒక ఫ్లాట్ ఫాం ఏర్పాటుచేసి ఒకే చోట ప్రజలందరికీ కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, సమీకృత మార్కెట్‌లో సామూహిక సౌచాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెన్నూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో సమీక్షించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్



**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్ పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కాంటెస్ట్‌లో ప్రతిభావంతులు అధిక సంఖ్యలో పాల్గొని విజేతలుగా నిలవాలని కోరారు. బాహ్య ప్రపంచానికి తెలియని గమ్యస్థానాలను కనుగొనడము, ప్రకృతి వన్యప్రాణి, ఆర్ట్, కల్చర్, హెరిటెజ్, వాటర్ బదాస్, రూరల్ ఏరియాలోబస, ఆధ్యాత్మికత. సాహసం (అడ్వంచర్) వంటి అంశాలపై 3 ఫోటోలతో సమర్పించాలన్నారు. కనెక్టివిటీ, దూరము, రవాణా, గూగుల్ లొకేషన్, 100 పదాలతో ప్రదేశం, సందర్శించిన సమయం, బస, బడ్జెట్, సేఫ్టీ గురించి వివరణను 60 సెకన్ల వీడియోలో పొందపరచాలని అన్నారు. ఆసక్తిగల వారు వచ్చే జనవరి 5, 2026లోగా సమర్పించాలని, గెలుపొందిన వారి వివరాలు సంక్రాంతి పండుగ రోజున తెలియజేయడం జరుగు తుందన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50,000, రెండవ బహుమతి రూ.30,000, మూడవ బహుమతి రూ.20,000, 10 కన్సొలేషన్ బహుమతులు అందజేయ డంతో పాటు 2 రోజులు ఉచితంగా హరిత హొటల్స్‌లో బస సదుపాయము కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, డిఆర్డీఓ, డిఎంహెచ్‌వో పాల్గొన్నారు.



# సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి

### ఇంటింటికీ వెళ్లి డబ్బులు అడుగుతున్న అభ్యర్థి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. 17న జరిగిన తుది విడత గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి పాలైన ఓ అభ్యర్థి తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికీ ఓటర్లను డిమాండ్ చేస్తూ కనిపించారు. వివరాల్లోకి వెళితే.. ఆసిఫాబాద్ మండలంలోని చిలాటిగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారుడైన ఏకొంకర్ మహేష్ ప్రత్యర్థి చేతిలో ఓటమి పాలయ్యాడు. అయితే మహేష్ ఓటమి జీర్ణించుకోలేక మహేష్ తన మద్దతుదారులతో కలిసి శుక్రవారం గ్రామంలో ఓటర్ల ఇండ్లకు వెళ్లి మీరు మాకు ఓటు వేయలేదు. కాబట్టి నేను మీకు ఇచ్చిన డబ్బులు వెనక్కి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దృశ్యాలను స్థానిక గ్రామస్తులు కొందరు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి. సోషల్ మీడియాలో పెట్టడంతో తీవ్ర వైరల్‌గా మారింది. జిల్లాలో ఇది రెండవ ఘటన.. రెండో విడత చింతలమానేపల్లి మండలంలోని అనుకోడా గ్రామ పంచాయతీకి జరిగిన ఎన్నికలలో ఓటమి పాలైన కాంగ్రెస్ మద్దతుదారుడు ఇదే తరహాలో ఓటర్ల ఇండ్లకు వెళ్లి డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఓటు ఎవరికి వేయాలనేది మా వ్యక్తిగత హక్కు. డబ్బులు ఇచ్చి ఓటు వేయించుకోవాలని అనుకోవడం.. ఓడిపోయిన తర్వాత తిరిగి డబ్బులు అడగడం సరైన పద్ధతి కాదని కొందరు గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఈనెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్నెస్ జోనల్ కోఆర్డినేటర్ మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆన్లైన్ ద్వారా సామూహిక ధ్యానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ధ్యానానికి సంబంధించిన గోడ పత్రాలను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఐక్యరాజ్యసమితి 2024లో ప్రతి సంవత్సరం డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించిందన్నారు.



### కోతుల కోసం.. ఎలుగుబంటి

# వేషం వేసిన కొత్త సర్పంచ్

### అభినందించిన గ్రామస్తులు

**కడెం, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

కోతుల బెడదను తప్పించేందుకు కొత్తగా ఎన్నికైన సర్పంచ్ వినూత్న ఆలోచన చేశాడు. ఎలుగుబంటి వేషం వేసుకుని గ్రామం నుంచి కోతులను తరిమికొట్టాడు. నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్ గ్రామ యువ సర్పంచ్ కుమ్మరి రంజిత్ చేసిన ఈ ప్రయత్నం ఇప్పుడు అందరిని ఆకట్టుకుంటుంది. లింగాపూర్ గ్రామ ప్రజలు రెండు మూడేండ్లుగా కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. కోతులను తరిమికొట్టేందుకు గతంలో చందాలు వేసుకుని గ్రామంలో అక్కడక్కడ బోనులు ఏర్పాటు చేశారు. ఆ బోనుల్లో ఎక్కడో కొన్ని కోతులు పడ్డాయి. కానీ పూర్తిస్థాయిలో ఈ ఇబ్బందిని రూపుమాపలేకపోయారు. ఈ నేపథ్యంలోనే కోతుల బెడదను తప్పించేందుకు కొత్తగా ఎన్నికైన సర్పంచ్ కుమ్మరి రంజిత్ వినూత్న ఆలోచన చేశాడు. ఎలుగుబంటి వేషం వేసుకుని గ్రామంలో తిరిగాడు. అలా ఎలుగుబంటి కనిపించడంతో కోతులు పరారయ్యాయి. ఇలా వినూత్న ఆలోచనతో కోతుల బెడదను తగ్గించిన యువ సర్పంచ్‌ను గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు.



# తెలంగాణ జర్నలిస్టులకు గుడ్ న్యూస్

**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, జర్నలిస్టులకు గుడ్‌న్యూస్ చెప్పింది. వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈజేహెచ్ఎస్ (ఎంప్లాయీస్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్) వెల్‌నెస్ సెంటర్లలో సేవలను విస్తరించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో, వెల్‌నెస్ సెంటర్లలో కార్డియాలజీ, నెఫ్రాలజీ వంటి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

## ముందస్తు అప్రమత్తతతో విపత్తుల

# సమయంలో ప్రాణ నష్ట నివారణ

- ఈనెల 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు




**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం, ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటి) అధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు అని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు అంశాలను కూలంకషంగా చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాల్లో విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉందని అన్నారు. ఈ నెల 22న విపత్తు నిర్వహణపై మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణ పొందేలా అవగాహన కార్యక్రమాలు కల్పించామని చెప్పారు. గత వర్షాకాలం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించాయని తెలిపారు. ముందస్తు అప్రమత్తత, స్పష్టమైన ప్రణాళికలు, విపత్తుల అంచనా, ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాల సమన్వయ చర్యలు, అధికార యంత్రాంగం, ప్రజల సహకారంతో ఎటువంటి నష్టాలు లేకుండా వరదలను ఎదుర్కొన్నామని వివరించారు. మున్ముందు కూడా ఎటువంటి నష్టాలు కలుగకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇటీవలి ప్రతి మండలానికి ఒకటి చొప్పున అత్యవసర సమయాల్లో ఉపయోగపడే వస్తువులతో కూడిన కిట్‌ను అందించామని చెప్పారు. మరింత విస్తృతంగా ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, డిఆర్డీఓ రవీందర్, జిల్లా అగ్నిమాపక, విద్యుత్, రోడ్లు భవనాలు, వైద్య, పశు సంవర్ధక, మున్సిపల్, పరిశ్రమలు, పౌరసరఫరాలు, ట్రాన్స్ పోర్ట్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ కళాశాలలో రోబోటిక్స్‌పై అవగాహన

- రోబోటిక్స్‌తో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- శిక్షణలు నైపుణ్యాలను మెరుగుపరుస్తాయి
- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓఝూ



**మంచిర్యాల, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో భౌతిక శాస్త్ర, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓఝూ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి సాంకేతిక యుగంలో రోబోటిక్స్ విద్యార్థులకు ఎంతో అవసరమైందని, విద్యా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఫర్హా యాస్మిన్ మాట్లాడుతూ రోబోటిక్స్ ద్వారా భౌతిక శాస్త్రంలోని సిద్ధాంతాలను ప్రాయోగకంగా అర్థం చేసుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు గులాం రసూల్ మాట్లాడుతూ రోబోటిక్స్‌లో ప్రోగ్రామింగ్, లాజికల్ థింకింగ్ కీలక పాత్ర పోషిస్తాయని, ఇలాంటి శిక్షణలు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుస్తాయన్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు త్రివేణి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై ఆసక్తి పెంచుకొని, పరిశోధన, ఆవిష్కరణల వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సోహం అకాడమీ సంతోష్, అజయ్, ఆదర్శ్‌లు విద్యార్థులను ఉత్సాహ పరుస్తూ విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో ఉత్సాహభరితంగా కొనసాగించి విజయవంతం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హరీష్, గంగయ్య, కుమార స్వామి, గోపాల్ కృష్ణ, రాజయ్య, మహేష్, కరుణాకర్, లక్ష్మి, మధు సుధన్, నవీన్, మంజుల, ఆహ్వానిత నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సర్వేను పకడ్బందీగా చేయాలి

### అధికారి డాక్టర్ శిరీన్

**ఇంద్రవెల్లి, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** కుష్టు రోగులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను ఆశా కార్యకర్తలు పకడ్బందీగా చేయాలని ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్, కేస్లాపూర్, పిట్ట బంగారం గ్రామాలలో ఆశాకార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరికీ పరీక్షించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. మార్కింగ్ సైతం కనబడేటట్లు చేయాలని అన్నారు. ఎక్కువ సంఖ్యలో అనుమానితులను గుర్తించి సంబంధిత వైద్యాధికారుల వద్దకు పంపించాలని అన్నారు. కేస్లాపూర్, పిట్టబొంగరం గ్రామాలలో గ్రామస్తులతో సమావేశమై కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్ రావు, రమేష్, సూపర్వైజర్లు సురేష్, ఆరోగ్య కార్యకర్తలు పద్మ, దేవిక, సంతోషి, అనసూయ, సుమిత్ర పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి

**మందమర్రి, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మందమర్రి సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధి కాసిపేట మండలంలోని కాసిపేట-1 గని వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని కుర్మపల్లికి చెందిన హరిప్రసాద్ కాసిపేట మండలంలో వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని తన ఇంటికి వస్తుండగా మరో బైక్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం గమనించిన స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన హరిప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాసిపేట ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# కో-ఆప్షన్ మెంబర్లుగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

### వీహెచ్‌పీఎస్ జాతీయ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ

**మందమర్రి, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మందమర్రి మండలం పులి మడుగు గ్రామంలో శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నిక కాబడిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో వృద్ధులు వితంతువులు, ఒంటరి మహిళలు వికలాంగులు చేయూత పెన్షన్ దారులు ఉన్నందున పంచాయతీ పరిధిలోని వారి సేవలు కొనసాగించేందుకు వారికి పంచాయితీ పాలనలో వికలాంగులను కూడా భాగస్వామ్యం చేసి పంచాయతీ కోఆప్షన్ మెంబర్ లుగా అవకాశం కల్పించాలని నూతన సర్పంచులకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్‌పీఎస్ నాయకులు మండల అధ్యక్షులు ఇందూరి రమేష్, బానోతు రాజు, బొద్దుల బుచ్చి రాజం, ధరావత్ రాందాస్, దురిశెట్టి లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మంచి బోధనతో

# బంగారు భవిష్యత్తు

**లక్షెట్టిపేట, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఉపాధ్యాయుల మంచి బోధనతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని లక్షెట్టిపేట మండల ఎంఈవో శైలజ సూచించారు. శుక్రవారం లక్షెట్టిపేట మండలంలోని కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఎంఈవో పరిశీలించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు.

# యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన ఉండాలి

**ఇక స్లాబ్ బుకింగ్ ద్వారా యూరియా - 22న వ్యవసాయ శాఖ ద్వారా యాప్ ప్రారంభం**

**వ్యవసాయ, మార్కెంటింగ్ రైతుల సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ రాజర్షి షా సమీక్షా సమావేశం**



**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** శుక్రవారం కలెక్టరేట్ సమావేశంలో రైతులు, సంబంధిత అధికారులతో కలిసి సోయాబిన్ పంట కొనుగోళ్లు, ఫర్టిలైజర్ బుకింగ్ యాప్, ఇతర వ్యవసాయ సమస్యలపై సమగ్ర చర్చ నిర్వహించారు. సమావేశంలో రైతుల తరపున పలువురు నాయకులు మార్కెట్‌లో సోయాబిన్ పంట కొనుగోలు సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, అధిక వర్షాల కారణంగా పంట రంగు మారడం, మద్దతు ధర ప్రకారం రైతులను ఆదుకోవాలన్న అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాణ్యత కలిగిన సోయాబిన్ పంటను ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నాణ్యత లేని పంటల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చిన తర్వాత రైతుల పంటను కొనుగోలు చేస్తామని తెలిపారు. అలాగే, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పంటలు, రైతుల వద్ద ఇంకా ఉన్న పంటల వివరాలను అధికారులు సేకరించాలని సూచించారు. రైతుల కోసం యూరియా సరఫరా సమస్యను పరిష్కరించడానికి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ఉపయోగంలోకి తీసుకురావడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. యాప్ ద్వారా రెవెన్యూ పట్టా, నాన్-డిఫ్, టెనెంటర్ రైతులు ఇంటి వద్ద నుండే ఫర్టిలైజర్ బుక్ చేసుకోవచ్చు. మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ చేసుకొని, నిర్ణిత వివరాలను నమోదు చేసి, బుకింగ్ అనంతరం 24 గంటల్లో సరుకును పొందాల్సిన వివరాలను స్పష్టం చేశారు. సమస్యలు, సందేహాల కోసం రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్ర దించవచ్చని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, జిల్లా సహకార అధికారి మోహన్, మార్క్ ఫెడ్ డిఎం ప్రవీణ్, వ్యవసాయ, ఉద్యానవన విస్తరణ అధికారులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అడ్డుకోకుండా చూడండి

**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో మంజూరైన 254 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అటవీశాఖ అధికారులు అడ్డుకోకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ చీఫ్ కన్వర్టర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి డాక్టర్ సువర్ణకు డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇండ్ల నిర్మాణ పనులకు ఆటంకం కలిగించవద్దని ఎమ్మెల్యే కోరారు.

## ఎస్పీఈను పునరుద్ధరించాలి

**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ (ఎస్పీఈ యాక్ట్ 1976)ను పునరుద్దరించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## 21న ఫుడ్ సెఫ్టీపై రిజిస్ట్రేషన్, లైసెన్స్ మేళా



**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఈ నెల 21 ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌక్, మార్వాడీ ధర్మశాలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్, లైసెన్స్ మేళాను నిర్వహించనున్నట్లుఅసిస్టెంట్ ఫుడ్ సెఫ్టీ కంట్రోలర్ టి.నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆహార వ్యాపార నిర్వహకుడు లైసెన్స్ లేకపోతే సదరు పత్రాలు సమర్పించి లైసెన్స్, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె కోరారు. లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని వారికి రూ.5లక్షల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధించడం జరుగుతుందని చెప్పారు. కావున ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైసెన్స్, రిజిస్ట్రేషన్ కొరకు ఆధార్ కార్డ్ జిరాక్స్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ లైసెన్స్ జిరాక్స్, పాస్పోర్టు సైజు ఫొటో, కరెంటు బిల్లు, జీఎస్టీ లైసెన్స్ తీసుకుని రావాలన్నారు. సందేహాలు నివృత్తి కోసం 9676974565 నంబర్ ను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సర్పంచ్ గెలుపుతో సహకార చైర్మన్ పదవికి రాజీనామా



**కాసిపేట, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నీలా రాంచందర్ తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో ఆమె కాసిపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. రెండు పదవులు ఉండకూడదనే నిబంధన మేరకు సహకార సంఘం చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ పదవి కాలం సహకరించిన సభ్యులకు, అధికారులకు నీలా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాసిపేట సర్పంచ్‌కు ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, డీసీసీబీ డైరెక్టర్ దుర్గం లక్ష్మీకి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సహకార వైస్ చైర్మన్ తాటిపాముల శంకర్ గౌడ్, సోగాల సాగర్, జంజిరాల విష్ణు మూర్తి, చెల్ల రమేష్, చుంచు మల్లేష్, సహకార బ్యాంక్ సూపర్ వైజర్ ప్రదీప్, సీఈవో రాజశేఖర్, భూక్య రాంచందర్, మాజీ కోఆప్షన్ సిరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## అందరి సహకారంతోనే ఎన్నికల ప్రశాంతం

**నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల**

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు, అధికారులు సహకారం అందించడం వలన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ... ఎన్నికల భద్రత దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం సుమారు 900 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది విడతలవారీగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజునుంచే జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 12 చెక్‌పోస్టుల వద్ద వాహనాలపై క్షుణ్ణమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో, ప్రత్యేక నిఘా కొనసాగించామని తెలిపారు. ఈ తనిఖీల్లో రూ. 14,67, 700 నగదు, రూ. 7 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని, వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించి పలు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదనంగా, గత ఎన్నికల్లో ఘర్షణలకు కారణమైన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యలుగా 151 కేసుల్లో ల201 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో చలి, పగలు-రాత్రి అన్న తేడా లేకుండా కర్తవ్యదీక్షతో పనిచేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు విభాగం సమన్వయంతో పనిచేయడంతోనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలియజేశారు.

## నేడు ఆదిలాబాద్‌లో పవర్ కట్

**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని టౌన్-3 ఫీడర్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నమ్రత తెలిపారు. ఖుర్షాపూర్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, శివాజీ చౌక్, పంజేష, మహాలక్ష్మివాడ, తిలక్ నగర్, భాగ్యనగర్, తాటిగూడ, చిల్కూరి లక్ష్మీనగర్, వడ్డెర కాలనీ, తీర్పెల్లి ఏరియాలలో విద్యుత్తు సరఫరా నిలిచిపోనుంది. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

# యూరియా బుకింగ్ యాప్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ**






**మంచిర్యాల, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, ఎరువుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎరువుల బుకింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా నిజమైన సాగుదారులకు జిల్లాలో యూరియా నిల్వల సమాచారం తెలుస్తుందని, ఎరువుల షాపుల వద్ద రద్దీ లేకుండా ఇంటి వద్దనే తమ మొబైల్‌లో యాప్ వినియోగించి ఎరువులను (యూరియా) 24 గంటలలో పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు వారు నిర్వహించవలసిన విధులపై అవగాహన కల్పించడం జరిగిందని, ఈ నెల 20వ తేదీ నుండి యాప్ అందుబాటులో తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ యాప్ ద్వారా మాత్రమే యూరియా బుక్ చేసుకుని రైతులు/సంబంధికులు బుకింగ్ ఐ.డి., పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు పత్రాలను డీలర్ వద్ద ధ్రువీకరించుకొని యూరియా బస్తాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్, మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.




# విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- ఈనెల 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు




**ఆసిఫాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవడం ద్వారా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం హైదారాబాద్ నుంచి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులతో కలిసి వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, అగ్నిమాపక, రహదారులు, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, ఇతర శాఖల అధికారులతో రక్షణ చర్యల ప్రణాళిక రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రజా రక్షణపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం సమయంలో కాలంలో సంబంధం లేకుండా ఆకస్మాత్తుగా వచ్చే వర్షాలు, తద్వారా వచ్చే వరదల వల్ల ప్రజల ప్రాణం, ఆస్తి నష్టం సంభవిస్తున్నందున, పరిశ్రమలలో జరిగే ప్రమాదాల వల్ల జరుగుతున్న ఘటనలలో ప్రజలను రక్షించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో వీసా హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఇతర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు, వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు ప్రజల ఆస్తులను, ప్రణాలను రక్షించడానికి అవసరమైనప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలను సురక్షితంగా కాపాడి వారికి పునరావాసం కల్పించడం, తక్షణ వైద్య సేవలు అందించే విధంగా పాటుపడుతున్నామని చెప్పారు. ఇతర అంశాలలో నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. జిల్లాలో వరదలు సంభవించేటప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జాతీయ విపత్తు రక్షణా బృందం, రాష్ట్ర విపత్తు రణ బృందాల సమన్వయంతో చర్యలు తీసుకుంటు న్నామని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో డీపీవో భిక్షపతిగౌడ్, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపకార వేతనం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఉపకార వేతనం కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో స్కాలర్ షిప్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాల నమోదుపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,674 మంది షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ప్రభుత్వ ఉపకార వేతనాలు అందిస్తుందని అన్నారు. వారి వివరాలను ఈ నెల 23 లేగా స్కాలర్ షిప పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. బాలికలకు రూ.1500, బాలురకు రూ.1000 అందిస్తున్నదని అన్నారు. వసతి గృహాలలో ఉంటూ చదువుకునే విద్యార్థులకు ఈ పథకం వర్తించదని, ఇంటి వద్ద నుంచి పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని చెప్పారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన సర్పంచ్, వార్డు సాథనాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో స్టేజ్-1, 2 ఆర్ఓలు, పోలింగ్ అధికారులుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయు లను అభినందించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్సీ సంక్షేమాధికారి అశోక్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లో చేరిన
# పలువురు బీజేపీ నేతలు

**తలమడుగు, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
బోథ్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ ఖాళీ అవుతోందని, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండ లం బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు, రెడ్డి సంఘం మాజీ అధ్యక్షులు, తాజా మాజీ విడిసి చైర్మన్ బడాల శ్రీకాంత్ రెడ్డి, తాజా మాజీ వార్డ్ మెంబర్లు సింగడి పవన్ రెడ్డి, నోముల నరేష్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మేర రమణ, తలమడుగు మండలం సుంకిడి గ్రా మా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉప సర్పంచ్ దాసరి లింగన్న తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఖండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు పలువురు ఎమ్మెల్యే ను కలిశారు. ఈ సందర్భంగా వారినీ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని, రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తలను గుర్తించేది బీఆర్ఎస్ పార్టీనే అని, అందరూ పార్టీ బలోపేతం కోసం కష్టపడితే పార్టీ పేరే అధికారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, మగ్గిడి నర్సమ్మ,ప్రకాష్, ఉప సర్పంచ్ జాదవ్ అజయ్,భీంరెడ్డి, దనందాస్ రెడ్డి, చెన్ రెడ్డి, మంగల్ ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి, సద్దాం, రమేష్ రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్ పాల్గొన్నారు.

## పెద్దనపల్లిలో బీఆర్ఎస్
# గెలుపు సంబరాలు

**కాసిపేట, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ గెలుపు సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్దనపల్లి సర్పంచ్‌గా కల్వల శరత్ కుమార్ గెలుపొందడంతో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం కాలనీల్లో విజయోత్సవ సంబరాలు నిర్వహించి ఇంటింటికి వెళ్లి తన గెలుపు కోసం ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బొల్లు రమణారెడ్డి, నాయకులు గొంది వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, చింతల భీమయ్య, సుధాకర్ రెడ్డి, లంక లక్ష్మణ్, వెల్ది శ్రావణ్, బందరి వినయ్, శేఖర్, పులికోట వంశీ, రెడ్డి కనకయ్య, జీదుల లక్ష్మణ్, గాదం సంపత్, మహిళా నాయకులు రామ లక్ష్మీ, బచ్చల మనోహర, గుర్రం వజ్ర పాల్గొన్నారు.



# డాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని ఫిర్యాదు



**మంచిర్యాల, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
సరైన వైద్యం అందించ కుం డా నిండు ప్రాణం పోవడా నికి కారణమైన డాక్టర్ ఎం. శ్రీలత లైసెన్స్‌ను రద్దు చేయాలని, శ్రీలత నర్సింగ్ హోంను సీజ్ చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు కొయ్యల ఏమాజీ శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు, డీఎంహెచ్‌వో అని తకు ఫిర్యాదు చేశారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లనే ప్రాణం పోయిం దని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాలలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న శ్రీలత నర్సింగ్ హోమ్ కు కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కుమ్మరి పద్మ వసంతరావు దంపతులు డెలి వరీ కోసం ఆసుపత్రికి ఈనెల 15వ తేదీన వచ్చారని తెలిపా రు. మధ్యాహ్నం 1 గంట ఆసుపత్రిలో అడ్మిట్ చేశారని కానీ 3.46 గంట లకు చెకప్ చేసి ఆపరేషన్ చేస్తానని చెప్పి రాత్రి 9 గంటల వరకు కూడా పట్టించుకోలేదన్నారు. రాత్రి డాక్టర్ వచ్చి కడుపులో ఉన్న బిడ్డ పల్స్ అందడం లేదని, ప్రాణం హైరిస్క్‌లో ఉందని ఆపరేషన్ చేయకుండా ఆపేశారన్నారు. తర్వాత ఆపరేషన్ చేయడంతో కడుపులో బిడ్డ చని పోయిందని తెలిపారు. బిడ్డ మృతికి కారణమైన డాక్టర్ శ్రీలత లైసెన్స్ రద్దు చేసి, బాధిత కుటుంబానికి రూ. 25లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం ఎల్లయ్య, రాజేశ్వర్, బాధితులు వసంతరావు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో ప్రజల స్పందన అద్భుతం

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు మొత్తం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పకడ్బందిగా పూర్తిచేయడంలో భాగస్వాములైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఎన్నికల ప్రక్రియ మరింత ప్రజాస్వామ్య పంథాలో సాగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల స్పందనకు జిల్లా తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలోని 399 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ఎన్నికలు పూర్తయ్యాయని, మూడు దశల్లో సరాసరి 82.80 శాతం పోలింగ్ నమోదై మంచి విజయవంతమైన ఎన్నికలుగా నిలిచిందని కలెక్టర్ తెలిపారు.





## చింతగూడలో పిచ్చి కుక్కల స్వైర విహారం

### ముగ్గురికి తీవ్ర గాయాలు

**జన్నారం, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మండలంలోని చింతగూడ గ్రామంలో పిచ్చికుక్కల స్వైర విహారం చేసి ముగ్గురుపై దాడి చేసి తీవ్ర గాయాలు చేశాయి. శుక్రవారం గ్రామంలోని కొందుకూరి మల్లవ్వ మునేసుల లక్ష్మీరాజం గుడిసెల పోసు, లను విచక్షణారహితంగా కొరకడంతో, వారిని స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం లక్షెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముందుగానే నూతన తాజా మాజీ సర్పంచ్, సుతారి సుమలత సంఘటన స్థలానికి వెళ్లి, గాయాల పాలైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పిచ్చికుక్కలు లేకుండా చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం కుక్కలు కరిచిన ముగ్గురు వ్యక్తుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో పిచ్చి కుక్కలు లేకుండా చూడాలని గ్రామస్తులు నూతన సర్పంచిని కోరారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి



**జన్నారం, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మండలంలోని తపాలపురం గ్రామానికి చెందిన రైతు మందపల్లి శంకరయ్యకు చెందిన గేదె విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. ఉదయం రైతు శంకరయ్య తన గేదెను మందలోకి వెళ్తున్న సమయంలో కమల విజయ ధర్మ ఇంటి సమీపాన ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దగ్గర ఈ ఘటన జరిగిందని రైతు తెలిపారు. విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన గేదెను మండల ప్రభుత్వ పసి వైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ పోస్టుమార్టం చేశారు. మృతిచెందిన గేద విలువ దాదాపు లక్ష యాభై వేల రూపాయలు ఉంటుందని, వారు తెలిపారు. ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ఘాతానికి మృతిచెందిన గేదెకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు శంకరయ్య కోరుతున్నామన్నారు.

## ఆసిఫాబాద్ ఎస్బీ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ బదిలీ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ఆసిఫాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) ఇన్స్పెక్టర్ చీమల రాణా ప్రతాప్‌ను శుక్రవారం ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయనను హైదరాబాద్ మల్టీజోన్-1 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాణా ప్రతాప్ స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న గడికొప్పుల సతీష్‌కు ఎస్బీ ఇన్స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో వాంకిడి సీఐగా పనిచేసిన రాణా ప్రతాప్ బదిలీకి పరిపాలనా కారణాలున్నట్లు సమాచారం. కారణం ఏదైనా మొత్తానికి ఆసిఫాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) ఇన్స్పెక్టర్ చీమల రాణా ప్రతాప్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్ట నివారణ

- ఈనెల 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు



**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం, ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) అధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు అని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు అంశాలను కూలంకషంగా చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాల్లో విపత్తుల నిర్వహణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని అన్నారు. ఈ నెల 22 న విపత్తు నిర్వహణపై మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణ పొందేలా అవగాహన కార్యక్రమాలు కల్పించామని చెప్పారు. గత వర్షాకాలం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించాయని తెలిపారు. ముందస్తు అప్రమత్తత, స్పష్టమైన ప్రణాళికలు, విపత్తుల అంచనా, ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాల సమన్వయ చర్యలు, అధికార యంత్రాంగం, ప్రజల సహకారంతో ఎటువంటి నష్టాలు లేకుండా వరదలను ఎదుర్కొన్నామని వివరించారు. మున్ముందు కూడా ఎటువంటి నష్టాలు కలుగకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇటీవలి ప్రతి మండలానికి ఒకటి చొప్పున అత్యవసర సమయాల్లో ఉపయోగపడే వస్తువులతో కూడిన కిట్‌ను అందించామని చెప్పారు. మరింత విస్తృతంగా ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# గక్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి



**కాగజ్‌నగర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** యువతకు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీడీవో ఉజ్వల్‌కుమార్ అన్నారు. తెలంగాణ మైనార్టీ విద్యా సంస్థల్లో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి మూడో జోష్ క్రీడా పోటీలు బలగల చింతగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల కాగజ్‌నగర్ బాలుర-1లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో ఉజ్వల్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలన్నారు. క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా చూడాలన్నారు. క్రీడల వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ నదీం ఖుదీస్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించున్నారు. ఈ మేరకు శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుమరం భీం జిల్లా ప్రాంతీయ సమన్వయ కర్త దాసరి రాజేందర్, విజిలెన్స్ అధికారి తహెరుద్దీన్, ప్రిన్సిపాల్ రోమిప్రతిభ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు

### విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**మంచిర్యాల, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల మండలం భవిత కేంద్రంలో మండల విద్యాధికారి వివస్వి మాలవీదేవి సమక్షంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు పట్టుదలతో చదివి ప్రయోజలు తయారు కావాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సెక్టోరియల్ అధికారి చౌదరి, ఐఏఆర్పిలు సృజన, శ్రీలత, మండలంలోని దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'మీ డబ్బు మీ హక్కు' కార్యక్రమంపై నేడు అవగాహన శిబిరం

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)** నేడు కలెక్టరేట్‌లో 'మీ డబ్బు మీ హక్కు' అనే అంశంపై ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు బ్యాంకుల్లో సంవత్సరాలుగా క్లెయిమ్ చేసుకోని డబ్బుకు సంబంధించి అవకాశం కల్పించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకులలో పొదుపు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, డివిడెంట్స్, బీమాలు క్లెయిమ్ చేసుకునేందుకు ఈ శిబిరం అవకాశం కల్పిస్తుందని అన్నారు. ద్వారా 10 సంవత్సరాలకు పైబడి బ్యాంకుల్లో క్లెయిమ్ చేసుకుని నిల్వ వివరాలు ఆర్బిఐ ఉద్గం వెబ్ సైట్ లో పొందవచ్చునని పేర్కొన్నారు. నిజమైన హక్కుదారులకు బ్యాంకుల్లోనే డబ్బులు పొందేందుకు ఈ శిబిరం ఆకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.




■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

■ 9జిల్లాల డీసీసీబీలు కూడా ■ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ■ ఆగస్టు 14వ తేదీనే ముగిసిన పదవీకాలం

■ పాలన స్తంభించకుండా సర్కార్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ■ పర్సన్ ఇంచార్జీలకు పీఏసీఎస్‌ల బాధ్యతలు

■ ఆయా జిల్లాల కలెక్టర్లు, డీసీసీబీలకు బాధ్యతలు ■ కొత్త జిల్లాలు, మండలాల ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణ

■ ఆ తర్వాతే సహకార సంఘాలకు ఎన్నికలు ■ వ్యవసాయ అనుబంధ పథకాలను క్షేత్ర స్థాయిలో చేసేందుకు చర్యలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), డీసీసీబీ టెస్కాబ్ చైర్మన్లు, డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు వ్యవసాయశాఖ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 14వ తేదీనే వీరి పదవీకాలం ముగిసినట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఇకపై వీరికి అధికారిక హోదా ఉండదని తెలిపింది. ఆయా జిల్లాల కలెక్టర్లు డీసీసీబీల బాధ్యతలు వహించనున్నారు. పీఏసీఎస్‌లకు పర్సన్ ఇంచార్జీలను నియమించనున్నారు. కొత్త మండలాలు, జిల్లాల ప్రకారం ప్రభుత్వం వీటిని పునర్వ్యవస్థీకరించనుంది. ఈ చర్యతో సహకార రంగంలో కొత్త పాలనా ఏర్పాట్లకు మార్గం సుగమమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# పీఏసీఎస్ పాలకవర్గాలు రద్దు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), డీసీసీబీ టెస్కాబ్ చైర్మన్లు, డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు వ్యవసాయశాఖ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 14వ తేదీనే వీరి పదవీకాలం ముగిసినట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఇకపై వీరికి అధికారిక హోదా ఉండదని తెలిపింది. ఆయా జిల్లాల కలెక్టర్లు డీసీసీబీల బాధ్యతలు వహించనున్నారు. పీఏసీఎస్‌లకు పర్సన్ ఇంచార్జీలను నియమించనున్నారు. కొత్త మండలాలు, జిల్లాల ప్రకారం ప్రభుత్వం వీటిని పునర్వ్యవస్థీకరించనుంది. ఈ చర్యతో సహకార రంగంలో కొత్త పాలనా ఏర్పాట్లకు మార్గం సుగమమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

**ముగిసిన పదవీకాలం...**

రాష్ట్రంలోని సహకార సంఘాలకు గత ప్రభుత్వం హయాంలో 2020 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరిగాయి. నిబంధనలు ప్రకారం ఐదేళ్ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితోనే ముగిసింది. అయితే, పరి పాలనాపరమైన కారణాల దృష్ట్యా అప్పట్లో ప్రభుత్వం వీరి పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించింది. ఆ పొడిగింపు గడువు కూడా ఆగస్టు 14వ తేదీతోనే పూర్తి కావడంతో, ప్రస్తుత ప్రభుత్వం పాత పాలకవర్గాలను పూర్తిగా రద్దు చేస్తూ తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే సహకార సంఘాల ఎన్నికలు జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**రైతు సంక్షేమంలో సహకార సంఘాల పాత్ర..**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార సంఘాలు వెన్నెముక వంటివి. రైతులకు అవసరమైన తక్షణ సాయాన్ని అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. సాగు అవసరాల కోసం రైతులకు స్వల్పకాలిక, మధ్యకాలిక రుణాలను అంద జేయడం చేస్తుంటాయి. సొసైటీల ద్వారా సబ్సిడీపై నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతులకు సరఫరా చేస్తాయి. ప్రభుత్వం మద్దతు ధరతో చేపట్టే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో పీఏసీఎస్ కీలక బాధ్యత వహిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వ్యవసాయ అనుబంధ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కూడా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నాయి.


**పర్సన్ ఇంచార్జీ పాలన దిశగా..**

పాలకవర్గాల రద్దు నేపథ్యంలో.. పీఏసీఎస్, డీసీసీబీల నిర్వహణ స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. తదుపరి ఎన్నికలు నిర్వహించే వరకు లేదా కొత్త ఉత్తర్వులు వచ్చే వరకు ఈ సంస్థల బాధ్యతలను పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలకు లేదా ప్రభుత్వ అధికారులకు అప్పగించనున్నారు. ముఖ్యంగా తొమ్మిది జిల్లాల డీసీసీబీలకు జిల్లా కలెక్టర్లను బాధ్యులుగా నియమించడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో సహకార ఎన్నికలకు మార్గం సుగమంకానుంది. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ సంఘాలను పునర్వ్యవస్థికరించే అవకాశం కూడా ఉందని అధికారవర్గాల తెలిపాయి.

## కొండంపేట ఎన్నిక ఫలితాలపై ఫిర్యాదు

**చెన్నూర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొండంపేట ఎన్నిక ఫలితాల్లో తారు మారు జరిగినట్లు సర్పంచ్ అభ్యర్థి నీల సంతోషి గ్రామస్తులతో కలిసి శుక్రవా రం ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఈ నెల 17న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా తాను పోటీలో ఉండగా ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో తప్పుడు ఫలితాలు ప్రకటించారని, రీకౌంటింగ్‌కు అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ నుంచి పోటీచేసిన అభ్యర్థిని గెలుపొందినట్లు ప్రకటించారన్నారు. అధికారులు ఏకపక్షంగా ఉండి కొండంపేట సర్పంచ్ ఎన్ని కల ఫలితాల్లో తారుమారు చేశారని, ఇప్పటికైనా అధికారులు రీకౌంటింగ్ జరిపించి న్యాయం చేయాలని ఆర్డీవోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



## బావిలో దూకి మహిళా ఆత్మహత్య

**సారంగాపూర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



సారంగాపూర్ మండలం ధని గ్రామంలో రాజమణి (36) అనే మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త, కుమా రుడు మరణించడంతో మానసికంగా కృం గిపోయి జీవితంపై విరక్తి చెంది ఈ దారు ణానికి పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్ర వారం తెలిపారు. గురువారం రాత్రి ఈ ఘ టన చోటుచేసుకుంది. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**మంచిర్యాల, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**



శుక్రవారం పెద్దంపేట రైల్వే స్టేషన్‌లో ఆడెపు వెంకటేష్ రైలు దిగుతుండగా, వెనుక నుంచి మరో రైలు ఢీకొట్టడంతో ఆయన మృతి చెందారు. మంచిర్యాలకు పని నిమిత్తం వచ్చి, స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏకంగా 3.8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత

**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**

చలి పంజా విసురుతోంది. ఉమ్మడి జిల్లాలో నిన్న కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. సాధారణం కంటే తక్కువ డిగ్రీల టెంపరేచర్స్ పడిపోయాయి. 8 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యిందని వాతావరణశాఖ పేర్కొంది. ఇక ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో చలి అసాధారణంగా పెరిగింది. ఏకంగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో నిన్న 5.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. చలికి తోడు విపరీతమైన పొగమంచు కూడా కురుస్తుండటంతో ఉదయం 9 దాటుతున్నావాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తీవ్రమైన చలి, పొగమంచు వలన అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వైద్యారోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.



# బాహుబలి లాంటి సినిమా కావాలట

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఇక ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. అలా రామ్ చరణ్ ఎన్టీఆర్ అల్లు అర్జున్ రవితేజ, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించింది. ఇక 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లక్ష్యం', 'సరైనోడు', 'నాన్నకు ప్రేమతో', 'ధ్రువ' వంటి సూపర్ హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో నిలిచింది. అయితే ఈ మధ్య రకుల్‌కి టాలీవుడ్‌లో అవకాశాలు కరువయ్యాయి. దీంతో బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తుంది. ఇక ఈ భామ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే నిర్మాత జాకీ భగ్నానిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి భర్తతో మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంది.ఇదిలా ఉంటే.. తాజాగా టాలీవుడ్ నుండి బాలీవుడ్ వరకు ఎందరో హీరోయిన్‌లకు వివిధ సినిమాలలో మేకప్ వేస్తూ వచ్చిన ప్రముఖ మేకప్ మాన్ కడాలి చక్రవర్తి(చక్రి) హైదరాబాద్‌లోని పంజాగుట్టలో నూతనంగా "సెకండ్ స్కిన్ మేకప్ స్టూడియో & అకాడమీ" ప్రారంభించడం జరిగింది. గతంలో రకుల్ ప్రీత్ సింగ్, తమన్నా వంటి ఎందరో స్టార్ హీరోయిన్లకు మేకప్ మెన్‌గా పనిచేసిన చక్రి తానే సొంతంగా ప్రారంభించిన ఈ నూతన మేకప్ స్టూడియోను ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మీడియా వారు అడిగిన ప్రశ్నలకు రకుల్ ప్రీత్ సింగ్ సమాధానం ఇస్తూ... "ఇటీవల కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడం వల్ల నేను తెలుగు సినిమాలను, తెలుగు వారిని ఎంతగానో మిస్ అవుతున్నాను.తప్పకుండా నేను తెలుగులో సినిమాలు చేస్తాను. నాకు తొలి విజయం అందించింది తెలుగు సినిమానే. నన్ను తెలుగు ప్రజలు అంతగా ఆదరించారు. ఒక చక్కటి కథ కోసం ఎదురుచూస్తున్నాను. నాకు మంచి తెలుగు కథ రావాలని నా అభిమానులంతా నా కోసం ప్రార్థించండి. హైదరాబాద్‌లో ఉండి షూటింగ్ చేయాలని ఎంతో కోరికగా ఉంది. ప్రస్తుతం కథలు వింటున్నాను. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నాను. తెలుగులో బాహుబలి వంటి సినిమా చేయాలని నా కోరిక. అదే నా డ్రీమ్ అండ్ డ్రీమ్ రోల్ కూడా" అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గామారాయి.




# సినిమాలకు పవన్ గ్యాప్..?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ హిట్ తో మంచి జోష్ లో ఉన్నారు. అందుకే తను కమిటైన ఉస్తాద్ భగత్ సింగ్‌ని పూర్తి చేశారు. హరీష్ శంకర్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా నెక్స్ట్ ఇయర్ సమ్మర్ రిలీజ్ కి రెడీ చేస్తున్నారు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది. ఇక ఈ సినిమా తర్వాత పవర్ స్టార్ ఏ సినిమా చేస్తారన్న సస్పెన్స్ కొనసాగుతుంది. ఓజీ 2 ఉంటుందని వార్తలు ఊపు చేస్తున్నా సుజీత్ నానితో సినిమా చేసిన తర్వాతే అది ఉంటుందని తెలుస్తుంది.ఈలోగా పవన్ కళ్యాణ్ తో సినిమాకు మరికొంతమంది డైరెక్టర్స్ రెడీగా ఉన్నా కూడా ఆయన అందుకు రెడీగా లేరని టాక్. ఉస్తాద్ రిలీజ్ అయ్యాక పవన్ కళ్యాణ్ రెండేళ్లు సినిమాలకు దూరంగా ఉండాలని చూస్తున్నారట. ఏపీ డిప్యూటీ సీఎంగా తన బాధ్యతలను చూసుకుంటున్న పవన్ కళ్యాణ్ సినిమాలు తన పనికి అడ్డు రాకూడదు అనుకుంటున్నారు. అందుకే ఇప్పటివరకు కమిటైన సినిమాలు పూర్తి చేసి నెక్స్ట్ సినిమాకు కాస్త టైం తీసుకునే ప్లాన్ లో ఉన్నారట.పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు 2, ఓజీ 2 ఈ రెండిటిలో ఏది ముందు చేస్తారు. ఓజీ అంటే సక్సెస్ అయ్యింది కాబట్టి ప్రీక్వెల్ లేదా సీక్వెల్ ఉంటుంది. కానీ వీరమల్లు 2 చేసే ఆలోచన ఉందా.. అంత సాహసం చేస్తారా లాంటి విషయాలకు క్లారిటీ రావాల్సి ఉంది. ఉస్తాద్ భగత్ సింగ్ తర్వాత పవన్ కళ్యాణ్ పూర్తిగా రాజకీయాల మీద తన బాధ్యతల మీద ఫోకస్ చేయనున్నారట. అందుకే ఏ కథ నచ్చినా.. ఏ డైరెక్టర్ వచ్చినా ఆఫ్టర్ 2 ఇయర్స్ అనేస్తున్నారట.ఈలోగా ఓజీ 2 కథ రెడీ అవుతుంది.. సో ఉస్తాద్ తర్వాత అంటే 2028 లో అలా సుజీత్ మళ్లీ ఓజీ 2 చేసే ఛాన్స్ ఉంటుంది. నెక్స్ట్ ఇయర్ ఉస్తాద్ భగత్ సింగ్‌తో పవర్ స్టార్ ఫ్యాన్స్ సరిపెట్టుకోవాల్సిందే. ఐతే ఈలోగా ఏదైనా షార్ట్ కథ.. స్పీడ్ గా చేసే ఛాన్స్ ఉంటే మాత్రం పవన్ కళ్యాణ్ ఓకే చెప్పే అవకాశం ఉంటుంది. మరి పవన్ కళ్యాణ్ నెక్స్ట్ సినిమాల షెడ్యూల్ ఎలా ఉంటుందో చూడాలి.ఫ్యాన్స్ మాత్రం పవన్ కళ్యాణ్ వరుస సినిమాలు చేయాలనే కోరుతున్నారు. ఐతే ఓజీ లాంటి సినిమాలు ఒకటి చేసి కాస్త గ్యాప్ తీసుకున్నా ఫ్యాన్స్ సాటిస్ఫై అవుతారు. ఐతే ఉస్తాద్ తర్వాత ఓజీ 2 కచ్చితంగా ఉండే ఛాన్స్ ఉంటుండగా నెక్స్ట్ స్టోరీస్ ఎలాంటివి చేయాలన్న ఆలోచనలో కూడా పవన్ కళ్యాణ్ ఈ గ్యాప్ తీసుకుంటున్నారని తెలుస్తుంది

# న్యూ ఇయర్ బ్రేక్ లేకుండానే 'స్పిరిట్' కంటిన్యూ..?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'స్పిరిట్' ప్రస్తుతం టాలీవుడ్‌లోనే అత్యంత చర్చనీయాంశమైన ప్రాజెక్ట్‌గా మారింది. హార్డ్ అండ్ బోల్డ్ యాక్షన్ చిత్రాలకు పేరుగాంచిన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.ఇక తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' టీమ్‌కు న్యూ ఇయర్ బ్రేక్ ఉండదని తెలుస్తోంది. నవంబర్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైన షూటింగ్, జనవరి తొలి వారం వరకు నిరంతరంగా కొనసాగనుంది. ముందుగా అనుకున్న న్యూ ఇయర్ సెలవులను పూర్తిగా రద్దు చేసినట్లు ఓ వర్గం వెల్లడించింది. షెడ్యూల్స్ కొంత వెనక్కి వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.ప్రభాస్ 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్ కోసం జపాన్ వెళ్లడం వల్ల షూటింగ్ ఆలస్యం కావడంతో, ఆ గ్యాప్‌ను కవర్ చేసేందుకు సందీప్ వంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారట. ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దక్షిణ కొరియా స్టార్ డాన్ లీ కూడా 'స్పిరిట్'లో భాగమవడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.





# మరో కొత్త జోడీ రెడీ?

'తేరే ఇష్క్ మే' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసింది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఇందులో ప్రేమికురాలిగా అలరించిన ఈమె.. ఇప్పుడు మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా 'కిక్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో కథానాయికగా కృతిసనన్‌ను ఎంపిక చేసే పనిలో ఉందట చిత్రబృందం. "నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా.. ఈ సినిమాను త్వరలో సల్మాన్ పుట్టిన రోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు సల్మాన్ సరసన నటించడానికి కృతి సనన్ అయితేనే సరిగ్గా సరిపోతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. బాలీవుడ్‌లో మరో కొత్త జంట తెరపైకి వచ్చే అవకాశాలున్నాయ"ని సల్మాన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి కృతి 'కిక్ 2'లో సందడి చేస్తుందో లేదో తెలుసుకోవాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# రేసులోనే పెద్ది..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది సినిమా 2026 మార్చి 27న రిలీజ్ లాక్ చేశారు. బుచ్చి బాబు డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ కలిసి నిర్మిస్తున్నారు. ఏ.ఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. ఆల్రెడీ సినిమా నుంచి రిలీజైన చికిరి సాంగ్ సెన్సేషనల్ హిట్ కాగా ఫస్ట్ షాట్ గా వచ్చిన టీజర్ పెద్ది పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఐతే పెద్ది సినిమా రిలీజ్ విషయంలో ఇంకా డౌట్ కొనసాగుతూనే ఉంది.చరణ్ పెద్ది సినిమాను మార్చి 27 రిలీజ్ ఫిక్స్ చేశారు. మార్చి 26న నాని ది ప్యారడైజ్ సినిమా వస్తుంది. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో దసరా తర్వాత వస్తున్న ది ప్యారడైజ్ మీద భారీ హైప్ ఏర్పడింది. ది ప్యారడైజ్, పెద్ది రెండు సినిమాలు వెంట వెంటనే రిలీజ్ అవుతున్నాయి. రెండు సినిమాలు రెండు డిఫరెంట్ కంటెంట్ తో వస్తున్నాయి. రేసులో ఏ సినిమా కూడా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదనిపిస్తుంది.ఐతే రీసెంట్ గా పెద్ది సినిమానే మార్చి 27 నుంచి సమ్మర్ కి షిఫ్ట్ అవుతుందని టాక్ వచ్చింది. కానీ ఆ వార్తలకు మరోసారి హీరో ద్వారా చెక్ పడింది. లేటెస్ట్ గా ఛాంపియన్ సినిమా ఈవెంట్ కి వచ్చిన చరణ్ పెద్ది సినిమా మార్చి 27న వస్తుందని మరోసారి అనౌన్స్ చేశాడు. సో పెద్ది అయితే అనుకున్న డేట్ కే వచ్చేలా దాదాపు ఫిక్స్ అయినట్టే. ఇక నాని కూడా తన ప్రమోషన్స్ లో మార్చి 26 రిలీజ్ అని చెబుతున్నాడు.పెద్ది డేట్ న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ అనుకున్నారన్న టాక్ వచ్చింది. కానీ మళ్లీ ఆ ప్రయత్నాన్ని వెనక్కి తీసుకున్నారు. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను సమ్మర్ కి షిఫ్ట్ చేసి పెద్దిని అనుకున్న డేట్ కే తీసుకు రావాలని ప్లాన్ చేశారు మైత్రి మూవీ మేకర్స్.సో చరణ్ అనౌన్స్ మెంట్ తో మరోసారి పెద్ది అనుకున్న డేట్ కి రావడం పక్కా అని తెలుస్తుంది. బుచ్చి బాబు ఈ సినిమా మీద తన ప్రాణం పెట్టి పనిచేస్తున్నాడని తెలుస్తుంది. పెద్ది సినిమా తో చరణ్ మాస్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు. RRR తర్వాత ఆచార్య, గేమ్ ఛేంజర్ నిరాశపరచడంతో పెద్ది మీద మెగా ఫ్యాన్స్ ఎక్స్ పెక్టేషన్స్ పెట్టుకున్నారు. పెద్ది ప్యారడైజ్ మధ్య కచ్చితంగా ఒక క్రేజీ ఫైట్ జరిగేలా ఉంది. ఐతే రెండు సినిమాలు కూడా కంటెంట్ విషయంలో తమ బలాన్ని చూపించేలా ఉన్నాయి.

## ముందస్తు అప్రమత్తతతో విపత్తుల

# సమయంలో ప్రాణ నష్ట నివారణ

- ఈనెల 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు




**మంచిర్యాల, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించి ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, పశుసంవర్ధక, పోలీస్, వ్యవసాయ, అగ్ని మాపక, రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య ఇతర అధికారులతో రక్షణ చర్యల ప్రణాళిక రూప కల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజారక్షణపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించినప్పుడు జాతీయ, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో వరద ప్రభావిత ప్రాంతాలలో ఆర్మీ సిబ్బంది వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రజలకు చేయవలసిన ప్రమాద హెచ్చరికలు, ప్రజా అవగాహన కొరకు చేపట్టవలసిన చర్యలు తెలుసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాప్ వ్యవస్థ, అత్యవసర నిర్వహణ కేంద్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, విపత్తుల సమయంలో వినియోగించుకుని చేపట్టవలసిన ప్రజా రక్షణ చర్యలను అమలు చేయాలని తెలిపారు. వర్షాల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డేటా బేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ద్వారా వివరాలు తీసుకొని రక్షణ చర్యల దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు



వారి పరిధిలోని విపత్తు ప్రభావిత ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని, క్రమబద్ధమైన నిర్వహణ ప్రక్రియ కలిగి ఉండాలని తెలిపారు. పునరావాస కేంద్రాలలో కనీసం 10 రోజులు ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖలు తమ పరిధిలో చేపట్టవలసిన రక్షణ చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీన అన్ని జిల్లాలలో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.




జిల్లాలోని చెన్నూర్ మండల తహసిల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల రక్షణ దిశగా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో ప్రజల రక్షణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి




**కాగజ్నగర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
యువతకు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీడీవో ఉజ్వల్కుమార్ అన్నారు. తెలంగాణ మైనార్టీ విద్యా సంస్థల్లో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి మూడో జోష్ క్రీడా పోటీలు బలగల చింతగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల కాగజ్నగర్ బాలుర-1లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో ఉజ్వల్కుమార్ మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలన్నారు. క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా చూడాలన్నారు. క్రీడల వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు.

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ నదీం ఖాదీస్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించున్నారు. ఈ మేరకు శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుమరం భీం జిల్లా ప్రాంతీయ సమన్వయ కర్త దాసరి రాజేందర్, విజిలెన్స్ అధికారి తహెరుద్దీన్, ప్రిన్సిపాల్ రోమిప్రతిభ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్లో బీజేపీ కార్యకర్తల ర్యాలీ

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలో సర్పంచుల సన్మాన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావుకు శుక్రవారం నిర్మల్ లో బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి రామారావు పటేల్ బిజెపి జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు కొండాపూర్ వద్ద స్వాగతం పలికి పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో

# యువకుడి మృతి

**కెరమెరి, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
పత్తి లోడ్తో వెళ్తున్న ట్రాక్టర్ను ఢీకొని కొఠారి గ్రామానికి చెందిన మహేష్(18) మృతి చెందగా జ్యోతి రామ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలంలోని కొఠారి గ్రామానికి చెందిన మహేష్, జ్యోతి రామ్ ఇద్దరు శుక్రవారం ధనురా గ్రామంలో బైక్ పై ఆసిఫాబాద్ వస్తున్న క్రమంలో పత్తి లోడుతో ముందు వెళ్తున్న ట్రాక్టర్ల వెనుక భాగంలో బైక్ ఢీ కొట్టడంతో మహేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. జ్యోతి రామ్ కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి 108 అంబులెన్స్లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# తుమ్మలగూడ సర్పంచ్ కాంగ్రెస్లో చేరిక



**బెజ్జూర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలోని తుమ్మలగూడ నూతన గ్రామ సర్పంచ్ కొండ రాంప్రసాద్ను అభినందించిన ఎమ్మెల్సీ దండే విఠల్ అనంతరం ఆయనను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఎమ్మె ల్సీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ త్వరలోనే పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేయడంతో పాటు రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కలెక్టర్ను అభినందించిన

# ఎస్టీయు ఉపాధ్యాయులు

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ ను ఎస్టియు ఉపాద్యాయ సంఘం శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది కలకుండా అన్ని వసతులు కల్పించాలని కృతజ్ఞతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ ఉపాధి సంఘం నాయకులు లక్ష్మణ్, వెంకటేశ్వర్లు. లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



# 41 మంది మావోయిస్టు లొంగుబాటు

- 24 ఆయుధాలు, 733 తూటాలు స్వాధీనం
- ఇద్దరు తెలంగాణ వాసులు...
- ఈ ఏడాదిలో 509మంది లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో ఎల్వీజీఏ నాయకుడు మంచిర్యాలకు చెందిన కనికారపు ప్రభంజన్
- వివరాలు వెల్లడించిన డీజీపీ శివధర్ రెడ్డి





**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**
నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పీఎల్‌జీఏ బెటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు లొంగిపోయినట్లు చెప్పారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు.

**ప్రోత్సాహకాలు అందజేత...**

లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకుపైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు కార్యకలాపాలు బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు హింసను వీడి జనజీవ నంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

**ఏడాదిలో 509 మంది..**

తెలంగాణకు చెందిన వారు కామారెడ్డి జిల్లా వాసి ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్, మంచిర్యాలకు చెందిన కనికారపు ప్రభంజన్ కాగా మిగతా వాళ్లు ఛత్తీస్గఢ్కు చెందినవారని తెలిపారు. అలాగే ఇద్దరు కుమురం భీమ్ డివిజన్ కమిటీ కార్యదర్శి, ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టుల్లో మొత్తం 54 మంది మాత్రమే తెలంగాణ వాళ్లు ఉన్నారని, వీరిలో ఆరుగురు మాత్రమే తెలంగాణలో పని చేస్తున్నారని శివధర్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు అప్పగించిన ఆయుధాలు దాదాపు అన్ని పోలీసులు నుంచి కొల్లగొట్టి నవేనన్నారు. ఆర్మీ, పోలీసులు వద్ద ఉండే ఆయుధాలే వారి వద్ద ఉన్నాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసులకు ఆయుధాల సీరియల్ నెంబర్లపై సమాచారం ఇస్తామన్నారు. వారికి గతంలో మిస్సైన ఆయుధాలను అప్పగించనున్నట్లు తెలిపారు.

# విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి





## ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్

**ఉట్నూర్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అందించిన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకొని విద్యలో మరింత రాణించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థినులకు ఉచిత కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమానికి గ్లోబల్ ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త ఎండి. సాబీర్ హుస్సేన్, ఐటిడిఏ ఉపసంచాలకులు అంబా జీ యాదవ్‌లతో కలిసి హాజరై విద్యార్థులకు ఉచిత కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ అధినేత ఎండి. బాబర్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని సబ్జెక్టులపై మరింత అవగాహన పెంచుకోవాలని, వార్షిక ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం తోపాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసి ఎంఓ జగన్, ఏటిడిఓ సదానందం, ఉట్నూర్ మండల విద్యాధికారి ఆశన్న, పాఠశాల ప్రిన్సిపల్ మాణిక్ రావు, గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# రాష్ట్రంలో పాలన గాడి తప్పింది

## అబద్దాలు మాట్లాడే సీఎంను ఎక్కడా చూడ లేదు

## సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో ఉమ్మడి జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలు

**నిర్మల్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
దేశంలో మోడీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరగడం వలన దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు అధికారులు ఉన్నాయని రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా డబ్బులు ఇంజన్ సర్కార్ రాబోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు అన్నారు. బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి తో కలిసి నిర్మల్ జిల్లాలో బిజెపి మద్దతు గెలిచిన సర్పంచులు ఉపసర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వారిని సన్మానించారు. ఈ సందర్భంగా బీజేఎల్పి నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారులు ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అబద్దాలు మాట్లాడే ముఖ్యమంత్రి ఎక్కడ చూడ లేదని బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన వారిని తమ పార్టీ అభ్యర్థులని ప్రకటించుకున్న ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని మహేశ్వర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి పాలన గాడి తప్పిందని త్వరలో 20 మంది ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి కుర్చీని లాగేందుకు ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎన్ని హామీలు గ్యారెం టీలు నెరవేర్చారు ప్రజలకు తెలుసని విమర్శించారు. ముఖ్యమంత్రి కూర్చి కాపాడేందుకు ఆయన ఢిల్లీ వెళ్తున్నారు గాని ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు జిల్లాలకు వస్తాలేరని ధజమెత్తారు. నిర్మల్ జిల్లాలో బిజెపి సర్పంచులు విజయం సాధించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మింగుడు పడడం లేదని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గెలిచిన బిజెపి మద్దతు సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల కోసం కష్టపడి పని చేయాలని బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అదిలాబాద్ జిల్లాలో బిజెపికి ఆదరణ లభించడం వెనుక పార్టీ నాయకులు కార్యకర్తల కష్టం ఉందని వారికి అన్ని విధాలుగా పాటి తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. ముథోల్ నియోజకవర్గం లో అత్యధికంగా బిజెపి సర్పంచులు గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేస్తామని హామీ ఇస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారులు ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలు మార్పు కోరి బిజెపి సర్పంచ్లను గెలుచుకోవడం జరిగిందని దీనిపై కాంగ్రెస్ పార్టీ నేతలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. నిర్మల్ జిల్లాలో బిజెపి సర్పంచులు గెలుపు వెనుక ప్రతి కార్యకర్త నాయకుల కృషి ఉందదని ఇదే స్ఫూర్తి రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో బిజెపి అఖండ విజయం సాధిస్తుందని జిల్లా అధ్యక్షులు రాథోడ్ అన్నారు పార్టీ నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో ఉండి జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి సీనియర్ నాయకులు భూమయ్య, రావుల రామనాథ్ పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం

## ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలు శంకర్

**ఆదిలాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత సమాచారం)**
ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువు ఎంత ముఖ్యమో క్రీడలు సైతం అంతే ముఖ్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అనే పేరును రూపుమాపాలని, ఆ దిశగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్‌లోని బంగారిగూడ మైనార్టీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీడల వల్ల గుర్తింపుతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి జిల్లా పేరును నలుమూలల చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లాలా మున్నా, శ్రీనివాస్, రాజేశ్వర్, రవి, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY